క్లుప్తంగా

భవానీలకు అమ్మ ఫ్రెండ్స్ ప్రసాదాల వితరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): గిరి ప్రదక్షిణ చేస్తున్న భవానీ దీక్షాపరులకు అమ్మ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో విద్యాధరపురం అప్పలస్వామి క్వారీ సెంటర్‌లో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. మొత్తం ఐదు రోజులు 24 గంటల పాటు భక్తులకు 18 రకాల ప్రసాదాలను అందించామని అమ్మ ఫ్రెండ్స్ సర్కిల్ ప్రధాన కార్యదర్శి వెంపరాల వెంకట భాస్కర్ తెలిపారు. దీక్ష విరమణలో చివరి రోజైన బుధవారం 108 మంది దంపతులతో చండీ హోమం నిర్వహించామన్నారు. పుష్కర కాలం కిందట ఏర్పాటు చేసిన తమ సంస్థ దాతల సహకారంతో అమ్మవారి సేవలో తరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షులు ఓలేటి హరిబాబు, కార్యదర్శి వీవీ భాస్కర్, కోశాధికారి దూపగుంట్ల శ్రీనివాసరావు, తిరునగరి వెంకటేష్ పర్యవేక్షించారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద నిరాశ్రయులైన వారికి అరవిన్ ఫౌండేషన్ బుధవారం దుప్పట్లను పంపిణీ చేసింది. ఫౌండేషన్ సమకూర్చిన ఈ దుప్పట్లను వెనుకబడిన, సంచార జాతుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.సి.చెన్నయ్య, అరవిన్ ఫౌండేషన్ సభ్యుడు బద్వేలు గురుమూర్తి నిరాశ్రయులకు అందజేశారు. దేశంలోని నిరుపేదలకు సాయం చేయాలనే ఉద్దేశంతో ఎన్ఆర్ఐలు అరుణ, రవి, విన్ని ఈ ఫౌండేషన్‌ను స్థాపించారని చెన్నయ్య, గురుమూర్తి తెలిపారు. ఉద్యోగ రీత్యా వారు అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరనివాసం ఉంటూ మాతృభూమి రుణం తీర్చుకోవడానికి చేస్తున్న సాయాన్ని అభినందించారు. కార్యక్రమంలో బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షుడు రమణ, బీసీ సంక్షేమ సంఘం బద్వేలు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎం.జయరాముడు పాల్గొన్నారు.

కాకాని సేవలు చిరస్మరణీయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో విద్య, వ్యవసాయం, పాడిపరిశ్రమ రంగ అభివృద్ధిలో కాకాని వెంకటరత్నం సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, జై ఆంధ్ర ఉద్యమనేత, మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం వర్ధంతి సభ బుధవారం బెంజిసర్కిల్‌లోని ఆయన విగ్రహం వద్ద జరిగింది. తొలుత పలువురు నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రాను ప్రత్యేక రాష్ట్రంగా విభజించాలని 70వ దశకంలోనే కాకాని డిమాండ్ చేశారని, అప్పుడే అలా జరిగితే ఇప్పటికి రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది ఉండేదన్నారు.
మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాక ముందు జిల్లాలో 9 పాఠశాలలు మాత్రమే ఉండేవని, వెంకటరత్నం మంత్రి అయిన తర్వాత 180 పాఠశాలలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. బెంజిసర్కిల్‌కు కాకాని సర్కిల్‌గా నామకరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షుడు తరుణ్ కాకాని మాట్లాడుతూ కాకాని ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముసునూరి రత్నబోస్, సెంటర్ ఫర్ మీడియా స్టడీస్(న్యూఢిల్లీ) చైర్మన్ నాగులపల్లి భాస్కరరావు, కలపాల వినయ్ సాగర్, గోగినేని ధనశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలపాల సూర్యప్రకాశరావు జీవిత అనుభవాలకు సంబంధించి ఆయన కుమారుడు వినయ్‌సాగర్ రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సుఖసంతోషాలను ప్రసాదించు ప్రభు..

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- ప్రార్థనలకు భారీగా తరలివచ్చిన క్రీస్తు విశ్వాసులు



విశేష అలంకరణలో సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చి



చర్చిలో పశువుల పాక

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సర్వమానవాళి సుఖసంతోషాలతో ఉండేలా ప్రభువైన ఏసుక్రీస్తు చూడాలని పలువురు క్రైస్తవ ప్రముఖులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ సందర్భంగా వన్‌టౌన్‌లోని పలు చర్చిల్లో బుధవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణలో చర్చిలు కళకళలాడాయి. క్రీస్తు చరిత్రను వివరించే బొమ్మలతో ఏర్పాటు చేసిన ప్రతిరూపాలు ఆకట్టుకున్నాయి. లోకరక్షకుని జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం అర్ధరాత్రి వరకు ప్రార్థనలు జరిగాయి. తిరిగి బుధవారం ఉదయం అన్ని చర్చిలు భక్తులతో కళకళలాడాయి. చర్చిల్లో కులమతాలకు అతీతంగా విశేష సంఖ్యలో నగర ప్రజానీకం ప్రార్థనల్లో పాల్గొన్నారు. చర్చిల్లో కొవ్వొత్తులు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు అన్ని చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి. పలువురు క్రైస్తవ ప్రముఖులు ప్రత్యేక ప్రార్థనలకు హాజరై ఏసుక్రీస్తు పుట్టిన వైనం, క్రీస్తు జనన వివరాలను తెలియజేశారు. భక్తులకు ఆశీర్వాదాలను అందజేశారు.

ఆకట్టుకున్న ప్రత్యేక గీతాలాపనలు

క్రిస్మస్‌ను పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని వివిధ చర్చిల్లో నిర్వహించిన క్రైస్తవ సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. చక్కని సంగీతంతో పాటుగా ఏసు క్రీస్తు దివ్యత్వాన్ని చాటే విధంగా సాగిన ఈ గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

సెయింట్ పాల్ సెంటినరీ చర్చిలో...
గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా ఉన్న సెయింట్ పాల్ సెంటినరీ చర్చిలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఆరాధనా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ పండుగ ప్రత్యేక ఆరాధన పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. నగరానికి చెందిన పలువురు క్రైస్తవ ప్రముఖులు ప్రత్యేక ప్రసంగం చేశారు. బుధవారం ఉదయం క్రిస్మస్ రెండో ఆరాధన బాప్తీస్మములు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చర్చి ప్రముఖులు ప్రత్యేక ప్రసంగం చేసి, శుభాకాంక్షలు తెలిపారు.



ఏసుక్రీస్తును ప్రార్థిస్తున్న భక్తులు

ఏసుక్రీస్తు భువికి దిగివచ్చిన రోజు క్రిస్మస్
భగవంతుడు మానవునిగా జన్మించి భూమిపైకి వచ్చిన రోజే క్రిస్మస్ పర్వదినమని సెయింట్ పీటర్స్ కెథడ్రల్ విచారణ కర్తలు రెవరెండర్ ఫాదర్ దామాల విజయకుమార్ అన్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని వన్‌ టౌన్ తారాపేటలోని పురాతన ప్రఖ్యాతిగాంచిన సెయింట్ పీటర్స్ కెథడ్రల్ బుధవారం ఉదయం జరిగిన క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ఫాదర్ దామాల విజయకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై భక్తులకు సందేశమిచ్చారు. క్రీస్తు జననం ద్వారా క్రీస్తు శకం, క్రీస్తు పూర్వం చరిత్ర పుటల్లో లిఖించబడిందన్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పూజా పీఠంపై విచారణకర్తలు ఫాదర్ దామాల విజయకుమార్ ఇతర గురువులు క్రిస్మస్ సమష్టి దివ్యపూజాబలి సమర్పించారు. పూజానంతరం కథోలిక క్రైస్తవులకు దివ్య సత్ప్రసాదం గురువులు అందజేశారు. క్రిస్మస్ కేక్ కట్ చేసిన విచారణకర్తలు భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాలయేసు జననం పశువుల పాక భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో నగర ప్రముఖులు, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చిలో....
వన్‌టౌన్ పాడివీధిలో ఉన్న సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చిలో బుధవారం ఉదయం, సాయంత్రం వేరువేరుగా ప్రత్యేక ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక అంశాలు అలరించాయి. యూత్‌లీగ్, ఉమెన్ సమాజ్‌లకు చెందిన ప్రతినిధులు క్రీస్తు విశిష్టతను చాటే పలు సాంస్కృతికాంశాలను ప్రదర్శించారు.

షాలేము మినిస్ట్రీస్ చర్చిలో..
భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలోని షాలేము మినిస్ట్రీస్ చర్చిలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. రెవరెండ్ పుట్ల శామ్యూల్ సుమంత్ కేక్ కట్ చేసి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. మానవ పాప విముక్తి, శాప విముక్తి, మరణ విముక్తి నుంచి విడుదల చేసి మానవాళిని రక్షించేందుకు క్రీస్తు లోకంలో జన్మించిచారన్నారు. క్రీస్తు జననం లోకమంతటికీ పండుగ అని చెప్పారు. సంఘ కాపరి పుట్ల సత్యవేదం భక్తులకు ఆశీర్వాదం అందజేశారు. యువతీ యువకులు క్రిస్మస్ గీతాలను ఆలపించారు.



షాలేము మినిస్ట్రీస్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న శామ్యూల్ సుమంత్



సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చిలో బాల ఏసు



వన్‌టౌన్ చర్చిలో ఏసుక్రీస్తు విగ్రహం

క్రీస్తు బోధనలు అనుసరణీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తోటివారిని ప్రేమిస్తూ కరుణ, దయ చూపాలన్న క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజన) చౌదరి అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యాధరపురంలోని ఫిలదెల్ఫియా ఏజీ చర్చిలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పాస్టర్ చార్లెస్ జాకోబ్, చార్లెస్ ఫిలిప్ జాకోబ్‌లు ప్రత్యేక ప్రార్దనలు చేశారు. చర్చిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ నేత పోతిన వెంకట మహేష్ పాల్గొన్నారు.



ఆశీర్వాదం అందుకుంటున్న పోతిన మహేష్



ఫిలథెల్ఫియా చర్చి ప్రార్థనల్లో ఎమ్మెల్యే సుజనా చౌదరి

ఘాట్లలో దీక్ష వస్త్రాల తొలగింపు వేగవంతం చేయాలి

పటమట(విజయవాడతూర్పు): భవానీ దీక్షల విరమణ ఆఖరి రోజు భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నందున వీఎంసీ సిబ్బంది ఘాట్లలో దీక్ష వస్త్రాల తొలగింపు పనులను వేగవంతం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆయన బుధవారం తెల్లవారుజామున భవాని దీక్ష విరమణ ఏర్పాట్లను కృష్ణవేణి ఘాట్, సీతమ్మ పాదాలు, హోల్డింగ్ ఏరియా, వినాయకుని గుడి, కెనాల్ రోడ్, దుర్గా ఘాట్, మోడల్ గెస్ట్ హౌస్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ భవాని దీక్షల విరమణకు వచ్చిన భక్తులు అధికంగా ఉండటంతో రాత్రి వేళలో కూడా భక్తులకు కల్పించే సౌకర్యాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పనుల పరిశీలన..
ఘాట్లలో భక్తులు విడిచిన దీక్ష వస్త్రాలను ఎప్పటికప్పుడు తొలగించి కన్వేయర్ బెల్ట్ ద్వారా ఒడ్డుకు చేరి అక్కడి నుంచి తరలించాలని కమిషనర్ ఆదేశించారు. వస్త్రాలను తరలించే వాహనాల సంఖ్య కూడా పెంచాలని, భక్తులకు కల్పించే తాగునీటి సరఫరాలో కూడా అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు ఎప్పటికప్పుడు తాగునీటి స్టాక్ పాయింట్ పరిశీలించాలని, వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన దుర్గా ఘాట్ వద్ద గల మోడల్ గెస్ట్ హౌస్‌లో ఉన్న కంట్రోల్ రూమ్‌లో ఉండే సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరా ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు.



కృష్ణవేణి ఘాట్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ముగిసిన భవానీ దీక్షల విరమణ









భవానీ దీక్షల విరమణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఆఖరి రోజు కావడంతో భవానీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో క్యూలైన్లలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. దుర్గగుడి మహామండపం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తుల రద్దీకి తగ్గట్టుగా వసతులు లేకపోవడంతో నీరసించిన భక్తులు నడక మార్గంలోనే సేద తీరారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

భవానీల సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



భవానీ దీక్షల విరమణ కార్యక్రమంలో సేవలందించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంద్రకీలాద్రి ఆలయంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భవానీ దీక్షల విరమణ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 200 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవలు అందించినట్లు ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి 25 వరకు నిర్వహించిన భవానీ దీక్షల విరమణ సేవలో భక్తులకు సేవలు అందించేందుకుగాను జిల్లా కలెక్టర్ ఆహ్వానం మేరకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు క్యూలైన్‌లో నియంత్రణ, అన్న ప్రసాదాల వితరణ, వికలాంగులకు సేవలు, తాగునీటి సరఫరా, వైద్య సేవలను అందించారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలను దేవస్థానం అధికారులు ప్రశంసించినట్లు తెలిపారు.

దీక్షల విరమణకు పయనం



భవానీపురం కరకట్ట రోడ్ నుంచి బయలుదేరిన భవానీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అమ్మవారి దీక్ష చేపట్టిన భవానీలు తమ దీక్షల విరమణకు భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీదాసాంజనేయ సహిత షిరిడీ సాయిబాబా, ఉమా రామలింగేశ్వర స్వామి మందిరం నుంచి బుధవారం బయలుదేరి వెళ్లారు. అక్కడ నుంచి గిరి ప్రదక్షిణ చేసి ఇంద్రకీలాద్రిపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఇరుముడులు సమర్పించారు. మందిరం ప్రధాన అర్చకులు గురుజాడ బాల చంద్రశేఖర శర్మ, అమృత పీఠం గురుభవానీ సన్నీ గురుస్వామి నేతృత్వంలో 216 మంది భవానీలు తమ మొక్కుబడులు తీర్చుకున్నారు.

40వ డివిజన్‌లో వాటర్ ట్యాంక్ ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం 40వ డివిజన్ పరిధిలోని లారీ స్టాండ్ వద్ద 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.30 కోట్లతో నిర్మించిన మంచినీటి ట్యాంక్‌ను బుధవారం ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో గుర్తిస్తూ ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని చెప్పారు. 1.50 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకు ద్వారా గాంధీ బొమ్మ రోడ్డు, కోళ్ల ఫారం రోడ్డు, చర్చి రోడ్డు, ఆకుల రాజేశ్వరరావు రోడ్డు, ఆర్టీసీ వర్క్ షాప్, టెలిఫోన్స్ కాలనీలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా అవుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి, ఈఈ వెంకటేశ్వరరెడ్డి, డీఈ కరుణాకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి

సాంస్కృతిక కళా వేదిక నిర్మాణానికి విరాళం

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోటలోని సుందరయ్య గ్రంథాలయంలో సాంస్కృతిక కళా వేదిక నిర్మించేందుకు సీపీఎం నాయకులకు బుధవారం కృష్ణలంకకు చెందిన నడికట్టు వెంకట సుబ్బమ్మ భారీ విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ మంచి ఆలోచనతో కళా వేదిక నిర్మాణానికి భారీ విరాళం అందజేసిన సుబ్బమ్మను అభినందించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత నడికట్టు వెంకటరెడ్డి, వారి పిల్లల పేరు మీద మెమోరియల్ హాల్ ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.కాశీనాథ్, ఎన్.హరినారాయణ, చంద్రశేఖర్, కృష్ణ, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏఐటీయూసీ వందేళ్ల సంబరాలు

పటమట(విజయవాడతూర్పు): కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారానికి శ్రమిస్తున్న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటీయూసీ) శత వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బూదే రాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం 10.30 గంటలకు విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద పతాక ఆవిష్కరణ జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు, సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు ప్రధాన అతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమానికి వీఎంసీ కార్మికులందరూ హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

గిరి ప్రదక్షిణలో దేవతా మూర్తులు



విద్యాధరపురం చెరువు సెంటర్‌లో..



చెరువు సెంటర్‌లో ఆలయ సెట్టింగ్

విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ నుంచి కబేళా సెంటర్ వరకు వివిధ సేవా సంస్థలు, భక్తులు భారీ సెట్టింగ్‌లలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని కేంద్రంగా చేసుకుని విఘ్నేశ్వరుడు, వారాహి మాత, వేంకటేశ్వరస్వామి, శివ పార్వతులు తదితర ఉత్సవ మూర్తుల విగ్రహాలతో కూడిన సెట్టింగ్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. గిరి ప్రదక్షిణ చేస్తున్న భవానీలు, వారిని అనుసరిస్తూ వచ్చే బంధువులు, సన్నిహితులు దేవతా మూర్తుల ఉత్సవ విగ్రహాల వద్ద ఆగి దుర్గమ్మకు నమస్కరించుకుని వెళ్తున్నారు. నిర్వాహకులు భవానీ భక్తులకు అమ్మవారి ప్రసాదాలు, అల్పాహారం, పండ్లు, పాలు, భోజనాలు పంపిణీ చేస్తున్నారు.

\- భవానీపురం(విజయవాడపశ్చిమ)



క్వారీ సెంటర్‌లో అమ్మవారి విగ్రహాలు



కబేళా సెంటర్‌లో